

స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

వ్యవసాయంపై ఆశలు

కొత్త ప్రభుత్వ నిర్ణయం కోసం రైతుల నిరీక్షణ

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తారా?

సబ్సిడీపై సాగు యంత్రాల కోసం ఎదురు చూపులు



కదిరి అర్బన్, జూలై 6: వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రైతులు.. ప్రస్తుత కొత్త ప్రభుత్వంపై అనేక ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసింది. గత ప్రభుత్వ హయాంలో పంటకు గిట్టుబాటు ధర లేక, చిరుధాన్యాలకు ప్రోత్సాహం లేక... తగినన్ని విత్తనాలు, ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. అప్పుల పాలయ్యారు.

అటకెక్కిన బిందుసేద్యం

ఎకరానికి తడి అందించే నీటితో పది ఎకరాలకు సేద్యం చేయగలిగే అవకాశం బిందు, తుంపర సేద్యంతోనే సాధ్యం. గడిచిన ఐదేళ్లలో రైతులకు సూక్ష్మవ్యవసాయ పనిముట్లు, బిందు, తుంపర సేద్యాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. 10 శాతం రైతులు చెల్లిస్తే 90 శాతం రాయితీతో అమలు అయ్యే ఈ పథకాన్ని నిర్వీర్యం చేసింది. రైతులు పూర్తిస్థాయితో పెట్టుబడులు పెట్టి, సేద్య చేయాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం తెచ్చింది.

యాంత్రీకరణ ఊసే లేదు

ఉపాధి హామీ పథకం వచ్చిన తరువాత కూలీల కొరత ఏర్పడింది. ఈసమస్యను తీర్చాలంటే వ్యవసాయ యంత్రీకరణ ఒక్కటే మార్గం. 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ పాలనలో స్ప్రెయర్లు, ట్రాక్టర్ల వరకు వ్యక్తిగత రాయితీలు కల్పించింది. తరువాత వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి మంగళం పాడేసింది. దీంతో రైతులు పూర్తిస్థాయి యంత్రాలు, పనిముట్లను పూర్తి మొత్తాన్ని చెల్లించి, పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ పరిస్థితి లేకుండా ఉండాలంటే యంత్రాలను రాయితీపై అందుబాటులోకి తేవాలని.. కూటమి ప్రభుత్వం ఆ వైపుగా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

పశుపోషణ భారమే..

ప్రతి రైతుకు గతంలో పాడి ఆవులు, ఎద్దులు ఉండేవి. సేదాన్యికి ఇబ్బంది ఉండేది కాదు. కొన్నేళ్లుగా పశు పోషణ భారమైంది. నీరు, గ్రాసం దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. చేసేదిలేక పశువులను అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం సేద్యం చేయాలంటే ట్రాక్టర్లే దిక్కు. టీడీపీ పాలనలో 50 శాతం సబ్సిడీతో సాగుయంత్రాలు, పనిముట్లు, వ్యవసాయ నూర్పిడికి పలురకాల యంత్రాలను అందించారు. వైసీపీ అధికారం చేపట్టాక, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో అన్నిరకాల పురుగుమందులు, ఎరువులు అందుబాటులో ఉంచుతామని నాటి పాలకులు చెప్పారు. గ్రూపులు ఏర్పాటు చేసి ట్రాక్టర్లను అందించారు. వంతులవారీగా పొలాలు దుక్కిలు చేసుకోవాలని సూచించారు. ట్రాక్టర్‌ను ఓ రైతు పేరుతో మంజూరు చేసి... మిగిలిన రైతులు తక్కువ అద్దెకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ రైతు సొంత పనులు చేసుకుంటూ, గ్రూపులోని మిగిలిన రైతులకు ట్రాక్టర్ ఇచ్చిన పాపాన పోలేదు. దీంతో ఈ పథకమూ అబాసుపాలైంది.

కూలీల కొరత

వ్యవసాయానికి కూలీల కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో కూలీలు దొరక్క... సాగు యంత్రాలు అందబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో చాలా వరకు వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పథకం ఉద్దేశం మంచిదే అయినా.. సరైన ప్రణాళికతో అమలు చేయకపోవడంతో రైతులు వ్యవసాయ కూలీల కొరతతో ఇబ్బందులు పడేలా తయారైంది. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయం జోరుగా ఉండే సమయంలో ఉపాధి పనులు కల్పించి.. అసలు పనులు లేని సమయంలో ఉపాధి కల్పించకపోవడంతో ఒక వైపు రైతులు.. మరో వైపు కూలీలు కష్టాల బారిన పడ్డారు. అలా కాకుండా ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే చాలా ఉపయోగంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

పెరిగిన ధరలు



వ్యవసాయ పరికరాల ధరలు భారీగా పెరిగాయి, స్ప్రింగ్ మడకలు రూ.30వేలు, ఇనుప మడకలు రూ.70వేలు, బాపన గుంటక రూ.28వేలు, బోది గుంటక రూ.40వేలు, విత్తన గొర్రు రూ.80వేలు, రోటోవేటర్ రూ.లక్ష 25వేల వరకు పలుకుతున్నాయి. వీటిని సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీతో అందించాని రైతులు విన్నవించుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు ట్రాక్టర్లకు గంటకు రూ.11వందలు చెల్లించి సేద్యం చేయించాలంటే కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. ధరలు అమాంతం పెరిగాయని, బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. గత ఐదేళ్లగా ఒక్క పరికరం కూడా ఇవ్వలేదని, ప్రస్తుత సీజన్‌లో సాగు ఎలా చేసుకోవాలో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బోరు బావులేవీ..?

సాగునీటి వనరులు అందుబాటులో లేని రైతులకు రాయితీపై బోరుబావులు వేయించడానికి వైఎస్ఆర్ జలకళ పేరుతో వైసీపీ ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే అది పూర్తి స్థాయిలో అమలు కాలేదు. వేసిన కొన్ని ప్రాంతాల్లో బోర్లలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ఈ పథకమూ నీరు గారింది.

రాయితీతో అందించాలి..



ప్రస్తుతం వ్యవసాయం చేయడానికి యంత్ర పరికరాలు చాలా అవసరం. వీటి ధరలు అమాంతం పెరగడంతో రైతులకు సేద్యం కష్టమవుతోంది. ప్రభుత్వం రాయితీలో వ్యవసాయ పరికరాలను అందించాలి. అద్దెలు పెట్టి దుక్కిలు చేయాలంటే రైతులపై భారం పడుతోంది.

- నరసింహులు, రైతు, దిగువపల్లి, కదిరి మండలం

అనుసంధానంతో మేలు..



ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే చాలా మేలు. కూలీల కొరత ఉండదు. ఖర్చులు కూడా 40 శాతం తగ్గుతాయి, రైతులు నష్టాల నుంచి బయపడే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

- చంద్ర, రైతు, కె.కుంట్లపల్లి, కదిరి మండలం

పోటెత్తిన భక్తులు

కిక్కిరిసిన ఖాద్రీశుడి ఆలయం

కదిరి, జూలై 6: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు స్వామివారిని దర్శంచుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు వసతులు ఏర్పాటు చేశారు.

జిల్లాలో మోస్తరు వర్షం

పుట్టపర్తి రూరల్, జూలై 6: జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి ఓమోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చిలమత్తూరు 39.4 మి.మీ, అత్యల్పంగా అమరాపురం 2.6 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. అమడగూరు 28.8 మి.మీ, నల్లచెరువు 28.6, గోరంట్ల 27.0 రొళ్ల 23.2, ఓబుళదేవరచెరువు 22.4, మడకశిర 22.0, రొద్దం 20.4, లేపాక్షి 19.2, తనకల్లు 15.8, హిందూపురం 15.8, గుడిబండ 15.2, నంబులపూలకుంట 14.6, పరిగి 13.6, గాండ్లపెంట 12.6, కదిరి 12.2, సోమందేపల్లి 11.4, అగళి 10.8, రామగిరి 8.4, నల్లమాడ 5.6, పెనుకొండ 5.4, పుట్టపర్తి 5.2, ముదిగుబ్బ 4.6, చెన్నేకొత్తపల్లి 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖాధికారులు పేర్కొన్నారు.

మెలకువలతోనే అధిక దిగుబడులు

ఏరువాక కేంద్రం పుట్టపర్తి కో ఆర్డినేటర్ జాన్సన్

కొత్తచెరువు, జూలై 6: రైతులు పంటలు సాగుచేసేటప్పుడు విత్తన శుద్ధితో పాటు కొన్ని మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని ఏరువాక కేంద్రం పుట్టపర్తి కో ఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్బీకేలో శనివారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగను ఈ నెలాఖరు వరకు విత్తుకోవచ్చన్నారు. వేరుశనగ విత్తనానికి ఇమిడాక్లోప్రైడ్ రెండు మిల్లీలీటర్లు, డైథేన్ ఎం 45 మూడు గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దుక్కిలోకి 20 కిలోల యూరియా, వంద కిలోల సూపర్‌ఫాస్పేట్, 33 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. వేరుశనగలో అంతర్‌పంటగా కందిని 15 సాల్లకు ఒకసాలు విత్తుకోవాల న్నారు. రసం పీల్చే పురుగు నివారణకు థయోడికార్బ్ 200 గ్రాములు, నవలురాన్ 200 మిల్లీలీటర్లు లేదా రుణ కాస్సాఫూర్ 50 మిల్లీలీటర్లు ఎకరానికి 200 లీటర్లనీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఎక్కువగా రసాయనిక ఎరువులు వినియోగించకుండా, సేంద్రియ ఎరువులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నటరాజ్, రైతులు పాల్గొన్నారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్, జూలై 6: బాలల పురస్కారాల కోసం జిల్లాలోని 18 సంవత్సరాలలోపు బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖకు 2025కు సంబంధించి అర్హులైన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానంగా క్రీడలు, సామాజికసేవారంగం, ధైర్యసాహసాలు, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రసాంకేతికత, విజ్ఞానం తదితర రంగాల్లో ప్రతిభ కనపరిచిన బాలబాలికలు అర్హులన్నారు. ఈనెల 31లోగా ఏడబ్ల్యూఏఆర్‌డీఎస్. జీఓవీ. ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులను పంపాలని పీడీ పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కాలువలు సైతం కబ్జానే

మిగిలింది మింగేశారు

- ప్లాట్లుగా మార్చి అధిక ధరలకు విక్రయం
- ప్రశ్నిస్తే సోషల్ మీడియాలో దాడి, బెదిరింపులు
- గత ఐదేళ్లలో వైసీపీ నాయకుల ఇష్టారాజ్యం

కదిరి, జూలై 6: గడచిన ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ భూమి కనబడితే చాలు వైసీపీ నాయకులు ఆక్రమించేశారు. చివరకు మిగులు భూములు, కాలువలు కూడా కనబడకుండా చేశారు. అయితే కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో ఈ ఆక్రమణలకు చెక్ పడింది. ఇప్పటికే కదిరిలో పలు చోట్ల ఆక్రమణలను తొలగించారు. మరికొన్ని కబ్జాలు ఇటీవలే బయటకొచ్చాయి. ఈ కబ్జా భూముల విలువ రూ.కోట్లలో ఉంటుంది. అక్రమార్కులు తమ భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కలుపుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టారు. వ్యక్తిగతంగా బెదిరించారు. కొంత మంది వైసీపీ నాయకులు కాలువను కూడా కబ్జా చేశారు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు.



వైసీపీ నాయకుడు తన పేర రాయించుకున్న మిగులు భూమి

మిగులు భూములు స్వాహా

కదిరి రూరల్ పొలం సర్వేనెంబర్ 1738/2లో 24 సెంట్లు మిగులు భూమి ఉంది. ఇది కదిరి, హిందూపురం రోడ్డుకు సమీపంలో కొత్త బైపాస్ రోడ్డు పక్కనే ఉంది. దీని విలువ రూ. కోట్లలో ఉంది. వాస్తవానికి ఇది పట్టా భూమి అయినప్పటికి ఎవరి పేరుతోనూ ఆన్‌లైన్‌లో లేదు. ఇది గమనించిన వైసీపీ సోషల్ మీడియా నాయకుడు అంజాద్ అలీఖాన్ తన పేరుతో రాయించుకున్నారు. రిజిస్టర్‌కు చేయించుకున్నాడు. ఆ తరువాత ఆభూమికి సరిహద్దులు చూపించి, పాస్ పుస్తకం ఇవ్వాలని కోర్టు ద్వారా రెవెన్యూ అధికారులను కోరారు. ఈవిషయం తెలుసుకున్న అసలైన భూ యజమానులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇది తమ పేరుతో ఉందని, ఇతరులకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. దీంతో రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోయారు. అయితే తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైసీపీ నాయకుడు మాత్రం తనకు భూమి చూపించాలని రెవెన్యూ అధికారులను బెదిరిస్తున్నట్లు సమాచారం.



బైపాస్ రోడ్డు సమీపంలో కాలువను కలుపుకుని ప్లాట్లు వేసిన దృశ్యం

కాలువలను కలుపుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం

పట్టణానికి సమీపంలోని కొత్తబైపాస్‌కు దగ్గరలో సర్వేనెం. 471, 473లో వైసీపీ నాయకుడు వజ్ర భాస్కర్‌రెడ్డికి కొంత భూమి ఉంది. మధ్యలో 472 సర్వేలో కాలువ వెళుతోంది. దీని విస్తీర్ణం దాదాపు 35సెంట్ల వరకు ఉంది. దీన్నికూడా కలుపుకుని ప్లాట్లు కింద మార్చి, అమ్మేసినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఇక్కడ ఎటువంటి కాలవ కనిపించదు. ఇక్కడ సెంటు భూమి రూ.పది లక్షలకుపైగానే ఉంటుంది.

వైసీపీ నాయకుల కబ్జా పర్వం

గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ అధికారంలో ఉంది. ఈసమయంలో పట్టణంలో పలువురు వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్లు సమాచారం. పట్టణానికి సమీపంలో ఉన్న ఎర్రగుట్టపల్లి వద్ద పాత ఇందిరమ్మకాలనీలో ప్రభుత్వం జగనన్నకాలనీ పేరుతో పట్టాలించింది. జగనన్న కాలనీలో ఒక సెంటుతో లబ్ధిదారులకు పట్టాలివ్వగా, ఆ ప్లాట్లు పోనూ మిగిలిన స్థలంలో రెండు, మూడు సెంట్లకుపైగా వైసీపీ నాయకులు ఆక్రమించుకుని అమ్ముకున్నట్లు సమాచారం. దీనిపైగా సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.



ఇటీవల టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

మేమూ వచ్చేస్తాం !

- టీడీపీలో చేరేందుకు కౌన్సిలర్ల తహతహ
- ఇప్పటికే ఐదుగురి చేరిక
- మరో ఇద్దరు, ముగ్గురి ఆసక్తి

మడకశిర టౌన్, జూలై 6: రాష్ట్రంలో అధికారం చేతులు మారడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే మడకశిర నగర పంచాయతీలో పలువురు కౌన్సిలర్లు సైకిల్ ఎక్కేందుకు యత్నిస్తున్నారు. నగర పంచాయతీ ఏరియాలో 20 వార్డులు ఉండగా 15 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు. మిగిలిన వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి ఎం.ఎస్.రాజు విజయం సాధించారు. దీంతో ఎన్నికల అనంతరం మడకశిరలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారి పోతున్నాయి. మడకశిర నగర పంచాయతీ చైర్మన్‌పై అసంతృప్తి ఉండటంతో పలువురు కౌన్సిలర్లు తెలుగుదేశంలో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. ఇంకా ఇద్దరు, ముగ్గురు చేరేందుకు సుముఖంగా ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం తెచ్చిన జీఓ ప్రకారం చైర్మన్‌పై నాలుగు సంవత్సరాలపాటు అవిశ్వాసానికి తావు లేదన్నది పలువురి వాదన. అయితే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండటంతో ఆర్డినెన్స్ ద్వారా అయినా ఆ నిబంధనను తొలగించి, చైర్మన్‌ను మార్చే అవకాశాలు ఉన్నాయని పలువురు టీడీపీ నాయకులు చెబుతున్నా రు. అయితే ముహూర్తం ఎప్పుడు అని పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే నగర పంచాయతీలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ల బలం పదికి చేరింది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఇద్దరూ టీడీపీ వారే ఉండటంతో చైర్మన్ పీఠం కైవసం చేసుకోవడం సైకిల్ పార్టీకి కష్టం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి, జూలై 6: ఆధ్యాత్మిక కేంద్రంలో సంగారెడ్డి జిల్లా భక్తులు చేపట్టిన సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా భక్తులు పర్తి యాత్రపేరుతో శనివారం ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మండ పంలో సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. నృత్యగానం భక్తులను అలరించింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు



మీసహకారం మరువలేనిది

కలెక్టరు అరుణ్‌బాబు



కలెక్టరు అరుణ్‌బాబును సన్మానిస్తున్న అధికారులు

పుట్టపర్తి, జూలై 6: పరిపాలన, సార్వత్రిక ఎన్నికల్లో మీ సహకారం మరువలేనిదంటూ బదిలీపై వెళుతున్న కలెక్టరు అరుణ్‌బాబు సిబ్బందితో పేర్కొన్నారు. కలెక్టరు క్యాంపు కార్యాలయంలో శనివారం జేసీ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భం గా కలెక్టరు అరుణ్‌బాబును ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు అధికారులు కలెక్టరు పనితీరును కొనియాడారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు.

- కలెక్టర్ బదిలీ నేపథ్యంలో జాయింట్‌కలెక్టరు అభిషేక్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బదిలీపై వెళతున్న కలెక్టరు అరుణ్‌బాబు నుంచి శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టరు టీఎస్ చేతన్ జిల్లాకు రావడం ఆలస్యం కావడంతో జేసీ ఇన్‌చార్జి కలెక్టరుగా వ్యవహరించనున్నారు.

● అనంతపురం జిల్లా పామిడి మండలంలో.. 44వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉంటుంది ఓ చిన్న పల్లెటూరు. ఈ ఊరిలోని ఓ యువరైతుకు కర్ణాటక యువతితో వివాహం జరిగింది. వరుడికి కన్నడ రాదు. వధువుకు తెలుగు రాదు. అయినా వారిద్దరికీ పెద్దలు వివాహం జరిపించారు. కారణమేమిటో వేరే చెప్పనవసరం లేదు.

● గుత్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన రాముడు అనే రైతుకు 9 ఎకరాల చీనీ తోట ఉంది. ఆయనకు ఉన్నది ఒకే కుమారుడు. పదో తరగతి వరకు చదుకుని, ఆ తర్వాత వ్యవసాయంలోకి దిగాడు. ఎలాంటి దురలవాట్లు లేవు. కానీ 33 ఏళ్ల వయసొచ్చినా పెళ్లి కాలేదు. మొదట్లో తమ కులం అమ్మాయే కావాలని వెతికారు. ఆ తరువాత ఏ కులమైనా పర్వాలేదు.. అమ్మాయి దొరికితే చాలని అనుకున్నారు. ఇక్కడ సాధ్యం కాక.. కర్ణాటకలోని గుల్బర్గాకు వెళ్లి సంబంధం ఖాయం చేసుకున్నారు. ఎట్టకేలకు ఆ యువరైతు పెళ్లి చేసుకున్నారు.



వ్యవసాయం చేస్తున్న రైతన్నలు




మోగదే.. కల్యాణవీణ..!

యువరైతులకు దొరకని పెళ్లి కూతుళ్లు

- సేద్యగాడికి పిల్లనివ్వని తల్లిదండ్రులు
- పదుల ఎకరాలు.. రూ.కోట్ల ఆస్తి ఉన్నా..
- అగ్రవర్ణ రైతాంగ కుటుంబాల్లో సంక్షోభం
- దూర ప్రాంతాలకు వెళ్లి.. కులాంతర వివాహాలు
- వధువుకు బంగారం.. తల్లిదండ్రులకు డబ్బు..
- బ్రోకర్లకు రూ.లక్షలు ఇచ్చి.. సంబంధాల వేట..
- రెండేళ్లలో 650కి పైగా ఇలాంటి పెళ్లిళ్లు

'పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు.. తప్పెట్లు తాళాలు.. తలంబ్రాలూ.. మూడే ముళ్లు.. ఏడే అడుగులు..' అని నూరేళ్ల జీవితాన్ని చాలా ఈజీగా చెప్పేశారు ఆత్రేయ..! ఆయన కాలం అట్లుండేది మరి..! కానీ పెళ్లంటే రైతు బిడ్డలకు ఇప్పుడు సినిమా కనిపిస్తోంది. సేద్యం చేసేవారికి పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో అనంతపురం జిల్లాలో వందలాది మంది యువకులు బ్రహ్మచారులుగా మిగిలిపోతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ పిల్లదొరకడం కష్టమని భావించి.. చాలామంది తెలంగాణ, కర్ణాటకలోని మారు మూల ప్రాంతాలకు వెళుతున్నారు. అక్కడ కులం, గోత్రంతో సంబంధం లేకుండా.. చివరకు భాష రాకపోయినా సరే.. ఎదురు కట్నం ఇచ్చి, గుట్టుగా పెళ్లి చేసుకుని మరీ వస్తున్నారు. వ్యవసాయ రంగం దీనస్థితికి అద్దం పడుతోంది ఈ పరిణామం. అన్నదాతలుగా ఖ్యాతి పొందిన రైతుల ఇంట కూతురు పెళ్లి జరుగుతోందేగాని.. కొడుక్కు పెళ్లి చేయడం మాత్రం కష్టంగా మారింది. చిన్నపాటి టీస్టాల్ పెట్టుకున్నవారికి, అత్తెసరు జీతంతో బతికే చిరుద్యోగికి సైతం అమ్మాయి దొరుకుతోందిగానీ.. పదుల ఎకరాల భూమి, రూ.కోట్ల ఆస్తి, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉన్నా.. సేద్యం చేసేవారికి మాత్రం పిల్ల దొరకడం లేదు. నిత్యం కష్టాలు, నష్టాలమయమైన వ్యవసాయం చేసేవారి వల్ల తమ బిడ్డలు సుఖపడరనే భావన ఆడపిల్లల తల్లిదండ్రుల్లో నెలకొంది. వ్యవసాయదారులకు ఖచ్చితమైన ఆదాయం లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని విశ్లేషకులు అంటున్నారు. వ్యవసాయం గిట్టుబాటుగా మారేదాకా ఈ పరిస్థితిలో మార్పు రాదని కూడా స్పష్టంగా చెబుతున్నారు. జిల్లాలో యువరైతులకు సమీప బంధువులేకాదు.. రాయలసీమ ప్రాంతంలో ఏ ఒక్కరూ పిల్లనిచ్చేందుకు ఇష్టపడటం లేదు. చేసేదేమీ లేక చాలామంది పక్కరాష్ట్రాల్లో వధువులను వెతుక్కుంటున్నారు. ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకుంటున్నారు.

- అనంతపురం టౌన్/కల్చరల్/రాప్తాడు/యాడికి




అనంతపురం జిల్లా యువరైతులు గడిచిన రెండేళ్లలో సుమారు 650 మంది కులమతాల పట్టింపులు వదిలేసి.. సుదూర ప్రాంతాల యువతులను పెళ్లి చేసుకున్నట్లు అంచనా. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, తెలంగాణలోని ఆదిలాబాద్, వరంగల్, కర్ణాటకలోని గుల్బర్గా, మంగళూరు తదితర ప్రాంతాల అమ్మాయిలు వందలమంది అనంతపురం జిల్లా కోడళ్లు అయ్యారు. ఇవేమీ ఆషామాషీగా జరిగిన వివాహాలు కాదు. బ్రోకర్లకు లక్షలాది రూపాయలు ముట్టజెప్పి మరీ చేసుకున్న పెళ్లిళ్లు..! ఇక ఎదురుకట్నం మొత్తంగా



రెండేళ్లలో 650 వివాహాలు

రూ.కోట్లలో చెల్లించి ఉంటారు. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఇలాఒంటి వివాహాలు వేల సంఖ్యలో జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇలాంటి దూరాభార పెళ్లిళ్ల జరిగేందుకు ముందు రెండు కుటుంబాల మధ్య ఆర్థిక ఒప్పందాలతోపాటు బంధాలకు సంబంధించిన ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారు. 'చూడప్పా.. మేము పిల్లనిస్తున్నాం. మీరు డబ్బులు ఇస్తున్నారు. ఒకసారి మా పాపను మీ ఇంటికి పంపిన తరువాత ఇంక మాకు సంబంధం లేదు. మాటి మాటికీ అంతదూరం వచ్చిపోవాలంటే మాకు కుదరదు. ఏ కష్టం వచ్చినా మీరే చూసుకోవాలి..' అని అమ్మాయి తరపువారు తెగేసి చెబుతున్నారట. సాధారణంగా వివాహం జరిగిన తరువాత కూడా అమ్మాయి తరపువారికి ఖర్చులు భారీగానే ఉంటాయి. తిరిగింపులు మరిగింపులు.. సారె, తొలి కాన్పునకు పుట్టింటికి తీసుకెళ్లడం వంటివి ఇందులో భాగం. కానీ ఇలాంటివేవీ తమకు సంబంధం లేదని వరుడి తరపువారికి వధువు కుటుంబ సభ్యులు ఆదిలోనే చెబుతున్నారని సమాచారం. అక్కడి పేదరికం అమ్మాయిలకు, ఇక్కడి వ్యవసాయ సంక్షోభం యువ రైతులకు ఇలా శాపంగా మారుతోంది.



అగ్రవర్ణాలవారికే ఇబ్బందులు

పొరుగు రాష్ట్రాలు, ఇతర జిల్లాలకు వెళ్లి పెళ్లికూతుళ్లను తెచ్చుకుంటున్న యువ రైతుల్లో ఎక్కువశాతం అగ్రవర్ణాల వారే ఉన్నారు. వీరిలో చాలామంది మధ్యలోనే చదువు మానేసి.. వ్యవసాయం చేసుకుంటున్నవారు ఉన్నారు. గ్రామీణ కుటుంబాలు కావడం, కుల కట్టుబాట్లు, పూర్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెత్తందారీ లక్షణాల కారణంగా సాధ్యమైనంత వరకూ సొంత కులాల అమ్మాయిలను పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాక.. వయసు పెరిగి, ఇక పెళ్లి జరగదేమో అనే సందిగ్ధంలో పడినవారు కులాంతర వివాహాలకు సిద్ధపడుతున్నారు. కానీ తమ ప్రాంతంలోని దిగువ కులాల అమ్మాయిలను చేసుకునేందుకు కులం, హోదాలు అడ్డొస్తున్నాయి. అందుకే దూర ప్రాంతాల అమ్మాయిలను చేసుకుంటున్నారు.





● యాడికి పట్టణానికి చెందిన ఓ రైతుకు రూ.కోట్ల విలువజేసే నాలుగు ఎకరాల పొలం ఉంది. రూ.80 లక్షల వరకు బ్యాంకు బ్యాలెన్సు ఉంది. తనది రెడ్డి సామాజికవర్గం. పదో తరగతి వరకు మాత్రమే చదివాడు. వ్యవసాయంలో దిట్ట. కానీ పెళ్లి కాలేదు. 25 ఏళ్ల నుంచి పెళ్లి కూతురు కోసం వెతుకుతూనే ఉన్నారు. ఇప్పుడు అతని వయసు 52 ఏళ్లు..! పిల్ల దొరక్కపోవడానికి ఒకే ఒక్క కారణం.. వ్యవసాయం..! ఎన్నో సంబంధాలను చూశారు. ఇంటి వరకూ చాలా సంబంధాలు వచ్చాయి. కానీ.. 'సేద్యమొకటేనా..? వేరే ఏమీ చేయడా..?' అని ప్రశ్నించి వెళ్లిపోయారు.

తల్లిదండ్రులకు నరకం

బెళుగుప్ప మండల కేంద్రానికి చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో మూడు గ్రామాలు ఉంటాయి. ఒక ఊరిలో సుమారు 500 కుటుంబాలు ఉంటాయి. అందరూ కమ్మ సామాజికవర్గం వారే. పూర్వం నుంచి వీరివి పెద్ద పెద్ద భూస్వామ్య కుటుంబాలు. ఉమ్మడి కుటుంబాలు విడిపోవడంతో కుటుంబాల భూముల విస్తీర్ణం తగ్గింది. అయినా.. ఒక్కొక్కరికి కనీసం 30 నుంచి 40 ఎకరాల పొలం ఉంటుంది. కొందరు చదువుకుని ఉద్యోగాలకు వెళ్లిపోయారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేస్తున్నారు. ఇలాంటి వారికి ఏ సమస్యా లేదు. కానీ ఊళ్లోనే ఉండి.. వ్యవసాయం చేస్తున్నవారికి మాత్రం పెళ్లి కావడం లేదు. వ్యవసాయం చేస్తున్న కొడుకులకు పెళ్లి చేయడం తల్లిదండ్రులకు నరకప్రాయంగా మారింది. చాలామంది సంబంధాలు చూసి చూసి.. విసిగిపోయారు. చివరకు ఇతర ప్రాంతాలకు వెళ్లి కులం, గోత్రంతో సంబంధం లేకుండా ఆడబిడ్డను కొనుగోలు చేసి మరీ పెళ్లి చేస్తున్నారు. ఆ ఊరికి చెందిన ఇద్దరు రైతులు బ్రోకర్ల సాయంతో కర్ణాటకకు వెళ్లి.. ఆడబిడ్డ తల్లిదండ్రులకు డబ్బులిచ్చి పెళ్లి కూతుళ్లను తెచ్చుకున్నారు. ముగ్గురి వయసు 40 ఏళ్లు దాటింది. ఇప్పటికీ పెళ్లి కాలేదని ఆ ఊరి జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే మండలంలోని మరో పల్లెలో 40 ఎకరాల పొలం ఉన్నా.. కొడుక్కు పెళ్లి కాలేదన్న మనోవేదనతో కుంగిపోయి ఓ తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికీ ఆ రైతు బిడ్డ బ్రహ్మచారిగానే మిగిలిపోయాడు.

పిల్లనిచ్చేవారు కరువయ్యారు..



మేము వయసులో ఉన్నప్పుడు భూములున్న యువ రైతులకు ఏరికోరి పిల్లనిచ్చేవారు. ఉద్యోగులకు పిల్లనిచ్చేందుకు ఇష్టపడేవారు కాదు. 'వాడు జీతగాడు..' అన్నట్లు తేలిగ్గా చూసేవారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. ఒకరి కింద పనిచేసేటోళ్లకే చక చకా పెళ్లిళ్ల అవుతున్నాయి. పదుల ఎకరాల భూములున్నా, వ్యవసాయం బాగా చేస్తున్నా.. పెళ్లి కూతురు దొరకడం లేదు. చాలా మంది యువ రైతులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఎదురుకట్నం ఇచ్చి పెళ్లి చేసుకొని వస్తున్నారు. మా మండలంలో చాలామంది కర్ణాటకలోని గుల్బర్గా, తెలంగాణ ప్రాంతాలకు వెళ్లి అక్కడి అమ్మాయిలను పెళ్లి చేసుకొని వస్తున్నారు. మా ఊర్లో పెళ్లికాని యువ రైతులు పదిమందిదాకా ఉన్నారు.

- నరసింహులు, నగరూరు, యాడికి మండలం

భూమి ఉండల్ల.. కానీ సేద్యం చెయ్యకూడదంట..



అప్పట్లో గడ్డివాములు, పేడ దిబ్బలు, ఇంట్లో గింజలు, భూమిని చూసి పిల్లనిచ్చేవారు. ఇవన్నీ ఎక్కువగా ఉంటే వెంటనే మంచి మాట చేసుకునేవాళ్లు. సేద్యం చేసే యువకులకు ఇట్లనే పిల్ల దొరికేది. బంగారు, డబ్బులు కట్నంగా ఇచ్చి.. ఇంటికాడ ఘనంగా పెండ్లి చేసి అత్తారింటికి సాగనంపేవాళ్లు. ఇప్పుడు భూమి ఉండల్ల... కాని సేద్యం చేయకూడదట. భూమి ఉండి.. ఉద్యోగం చేసే యువకుడికైతే పిల్లనిస్తాండారు. సేద్యం మాత్రమే చేస్తున్నాడంటే.. 'మా బిడ్డ పొలానికి యాడ పోతాది...? ఎండ, గాలికి సేద్యం పని యాడ చేస్తాది..?' అని ఆడపిల్ల తల్లిదండ్రులు అంటాండారు. సేద్యం కాకుండా చిన్న ప్రైవేటు ఉద్యోగమైనా కానీలే.. అని ప్రైవేటు ఉద్యోగం చేసేవాళ్లకే పిల్లనిస్తుండారు.

- ఎర్రిస్వామి, రాప్తాడు

గడ్డివాములు, ఎరువు దిబ్బలు చూసి పిల్లనిచ్చేవారు..



అప్పట్లో పెద్దోళ్లు పెళ్లి సంబంధాలు చూడటానికి వస్తే.. ఎన్నెకరాల భూమి ఉంది..? దొడ్లో గడ్డివాములు ఎన్ను న్నాయి..? అని చూసేవారు. ఎరువు దిబ్బలు, ఇంట్లో తిండి గింజలు, కొట్టంలో ఎద్దులను పరిశీలించేవారు. భూమి ఎంత ఎక్కువ ఉంటే అంత ప్రాధాన్యం ఉండేది. అట్లాంటి కుటుంబాలకు పిల్లనిచ్చేకి ఎగబడేవారు. వరకట్నం ఇచ్చి ఘనంగా పెళ్లి చేసి అత్తారింటికి పంపేవారు. అప్పటికీ ఇప్పటికీ కాలం మారింది. ప్రస్తుతం వ్యవసాయం చేసే యువకులకు పిల్లనివ్వడం కష్టంగా మారింది. కొన్ని సామాజికవర్గాలలో వ్యవసాయం చేసే యువ రైతులకు పిల్లనివ్వం అని తెగేసి చెబుతున్నారు. దీంతో వారు దూర ప్రాంతాల వెళ్లి వేరే కులాల యువతులకు బంగారం పెట్టి, ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకొని వస్తున్నారు.

- ఈశ్వరయ్య, రాప్తాడు

● యాడికి మండలంలోని ఓ పల్లెకు చెందిన కమ్మోళ్ల పిల్లోడిది ఇంకో కథ. తనకు పదెకరాల పొలం ఉంది. వేరుశనగ, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు సాగుచేస్తుంటాడు. ఏడాదికి రూ.10 లక్షలకు పైగా పంటల దిగుబడి తీస్తాడు. తనకు 25 ఏళ్ల వయసు వచ్చినప్పటి నుంచి పెళ్లి సంబంధాలను చూడటం మొదలు పెట్టారు. 'సేద్యగాడికి పిల్లనెలా ఇచ్చేది..?' అని అటువైపు వారు అనేవారు. అలా ఓ పదేళ్ల గడిచాయి. ఆ యువకుడి వయసు 35 ఏళ్లకు చేరింది. ఇక్కడే వెతికితే అయ్యే పని కాదని అనుకున్నారు. కులం.. ప్రాంతం పట్టింపులు లేకుండా.. దూర ప్రాంతాల్లో సంబంధాలు వెతకడం ప్రారంభించారు. తెలంగాణలో ఓ అమ్మాయి దొరికింది. ఆరు తులాల బంగారం, రూ.2 లక్షల నగదు ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకున్నాడు. అంటే.. గురజాడ కాలంనాటి కన్యాశుల్కం అన్నమాట..!









పరిష్కారం కనుగొనాలి..



వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను కాపాడేందుకు ఎంఎస్ స్వామినాథన్ చేసిన సిఫారసులు ఇప్పటికీ అమలు కాకపోవడం నేటి ఈ దుస్థితికి కారణం. వ్యవసాయదారులకు పెళ్లిళ్ల జరగడమే సమస్యగా మారడం సామాజిక సంక్షోభానికి దారితీస్తుంది. ఇప్పటికే రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలకు తోడుగా సామాజిక అభద్రత ఏర్పడితే అది అశాంతికి దారితీస్తుంది. కాబట్టి ప్రభుత్వాలు వ్యవసాయ సంక్షోభంతోపాటు సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలి.

- వి.రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

చిన్నదైనా సరే.. ప్రైవేటు ఉద్యోగం చూసుకోవాలట..!



రాప్తాడు మండలంలో ఓ పల్లెటూరి రైతుకు ఒక్కడే కొడుకు. రెడ్డోళ్ల పిల్లోడు..! చూడచక్కని రూపం. వారికి 15 ఎకరాల పొలం ఉంది. సొంత ఇల్లు, ట్రాక్టర్ ఉన్నాయి. మంచి కుటుంబం అన్న పేరుంది. వేరుశనగ, టమోటా, బెండ, వరి తదితర పంటలను సాగు చేస్తాడు. ఏడాదికి కనీసం రూ.10 లక్షలు సంపాదిస్తాడు. రాజకీయాల్లోనూ చురుగ్గా ఉంటాడు. కానీ ఏం లాభం..? ఎవ్వరూ పిల్లనివ్వడం లేదు. సొంత సామాజిక వర్గం అమ్మాయి దొరికితే.. ఎదురు కట్నం ఇచ్చేందుకూ తల్లిదండ్రులు సిద్ధంగా ఉన్నారు. 'ఆడపిల్లకు బంగారం పెడతాం. వాళ్ల అమ్మానాయనకు డబ్బులు ఇస్తాం. పెళ్లి ఖర్చు ఎంతైనా మేమే పెట్టుకుంటాం. మా వాడికి పిల్లను చూడండి..' అని బంధువులకు, తెలిసినవారికి చెబుతున్నారు. 'సేద్యం చేస్తున్నాడంటే పిల్లను ఎవరిస్తారు..? యాదో ఒకటి.. చిన్న ప్రైవేటు ఉద్యోగమైనా చూసుకోమనండి...' అని తేలిపోతున్నారట అందరూ..! ఇప్పుడు ఆ యువ రైతు వయసు 30 ఏళ్లు.

● యాడికి మండల కేంద్రానికి సమీపంలో ఉంటుంది ఆ ఊరు. కమ్మ సామాజికవర్గానికి చెందిన ఓ రైతు బిడ్డ డిగ్రీ వరకు చదివాడు. ఐదెకరాల పొలం ఉంది. ఎటువంటి అప్పులు లేవు. రూ.20 లక్షలకు పైగా నగదులో ఉన్నాడు. వ్యవసాయం మాత్రమే చేస్తాడు. తన కాళ్లపై తాను నిలబడ్డాడు. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి 26 ఏళ్ల వయసు వచ్చినప్పటి నుంచి పెళ్లి సంబంధాలను చూశారు. దాదాపు 14 ఏళ్ల పాటు సంబంధాలను చూశారు. వ్యవసాయం చేస్తున్న కారణంగా అతనికి పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో విసుగొచ్చి.. 40 ఏళ్ల దాటిన తరువాత వివాహ ప్రయత్నాలను మానేశాడు. ఇప్పుడు అతని వయస్సు 54 సంవత్సరాలు.



ఆలోచనలు మారాయి..

అందరూ కాలం మారిందటున్నారు. కాలం కాదు.. మనషుల ఆలోచనలు మారాయి. పూర్వం భూములు ఎంత ఎక్కువ ఉండి, కష్టపడి పనిచేసుకునే కుటుంబాలవారికి ఆడపిల్లలను ఇచ్చి పెళ్లి చేసేవాళ్లం. ఇపుడు అంతా రివర్స్ అయింది. భూములు ఉండాలి. ఎక్కడో ఏదో ఉద్యోగం చేయాలి. అక్కడ తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ఉండకూడదు. అల్లుడు, బిడ్డ మాత్రమే ఉండాలి. ఇదీ.. ఆడపిల్లల తల్లిదండ్రుల ఆలోచన. ఆడపిల్లలకు కూడా ఇలాగే ఆలోచిస్తున్నారు. 'వ్యవసాయం చేసేవారికి పిల్లనిస్తే మన కూతురు నిత్యం కష్టపడాలికదా?' అని.. రైతుకు పిల్లనివ్వడం లేదు. అందుకే సేద్యం చేసుకుని బతికే మగపిల్లలకు పెళ్లిళ్ల కాక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొందరు ఎలాంటి సంబంధంలేని ప్రాంతాలకు వెళ్లి... అక్కడ కులం, గోత్రం ఏదీ చూడకుండా.. ఆడపిల్లల తల్లిదండ్రులకు కొంత డబ్బు ఇచ్చి పెళ్లి చేసుకొని వస్తున్నారు. అలా వచ్చిన ఆడపిల్లలు కూడా నచ్చితేనే ఉంటున్నారు. లేకపోతే వెళ్లి పోతున్నారు. రాకెట్లలో ఒక అమ్మాయిని ఇలాగే చేసుకొని వచ్చారు. ఆమె ఇక్కడ ఉండలేక వెళ్లిపోయింది. ఇప్పటికీ కులం, గోత్రం, సంప్రదాయం అనుకునే వారు పెళ్లి చేసుకోకుండా అలాగే ఉండి పోతున్నారు. రైతులు ఉండే ఒక్కో గ్రామంలో కనీసం నలుగురైదుగురు పెళ్లి కాని వారు ఉంటారు. రైతుకు ఇలాంటి కష్టాలు వస్తాయని కలలో కూడా అనుకోలేదు.

- మాలపాటి ఎర్రిస్వామి, ఎర్రగుడి కొట్టాల, బెళుగుప్ప మండలం

మా పాప పొలానికి వెళ్లలేదు..

రాప్తాడు మండలంలోని ఓ పల్లెలో కమ్మ, రెడ్డి సామాజికవర్గం యువకులు పది మందికి పైగా పెళ్లీడుకొచ్చారు. ఎకరాలకు ఎకరాలు భూములు, సొంతిళ్ల, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. ఏటా పంటలు బాగా పండిస్తారు. ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేవు. అయినా ఎవరికీ పిల్ల దొరకడం లేదు. ఎంత ఆస్తి ఉన్నా.. సేద్యగాడికి పిల్లనివ్వడం అంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. 'పంటలు సరిగా పండవు. గిట్టుబాటు ధరలు ఉండవు. పైగా మా పాప పొలానికి వెళ్లలేదు. రైతులకు ఇచ్చి కష్టపెడతామా ఏంది..?' అని ఆడపిల్లల తల్లిదండ్రులు అంటున్నారట..! ఇట్లయితే పెళ్లి కావడం కష్టమేనని భావించి.. చాలామంది దళారులను ఆశ్రయిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణలోని మారుమూల ప్రాంతాలకు చెందిన వేరే కులాల అమ్మాయిలకు బంగారు పెట్టి, ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకుని వస్తున్నారు. దళారులకు వేలాది రూపాయలు ముట్టజెప్పుతున్నారు.





ధరల నియంత్రణకు సహకరించండి : డీఎస్ఓ

పుట్టపర్తి, జూలై 6: జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. జేసీ అభిషేక్ కుమార్ ఆదేశాల మేరకు ఆయన శనివారం కలెక్టరేట్‌లో ధరల నియంత్రణపై మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ.. జిల్లాలో కందిపప్పు, బియ్యం, చక్కెర ధరలను అదుపులో ఉంచేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. ఇందులో భాగంగా మిల్లర్ల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. సమావేశంలో జిల్లాలోని సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట, జూలై 6: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామనాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల వాయిదావేసినట్లు చెప్పారు. ఎంపీపీ జగన్మోహన్ అధ్యక్షతన ఈనెల 11న నిర్వహించే సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రోడ్డుపై మురుగు తొలగింపు

ముదిగుబ్బ, జూలై 6: ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మండల కేంద్రంలోని రామస్వామి తండాలో పెద్దమ్మ గుడికి వెళ్లే రోడ్డుపై నిత్యం మురుగునీరు నిల్వ ఉండడంతో, స్థానికులు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై గురువారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'ఇలా ఉంటే రోగాలు రావా..!' అనే శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఈఓఆర్‌డీ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ సిబ్బంది మురుగును తొలగించి, రోడ్డును శుభ్రం చేశారు. దీంతో ఒండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వినియోగదారుల సంఘాన్ని బలోపేతం చేస్తాం

జిల్లా అధ్యక్షుడు

పుట్టపర్తి, జూలై 6 : జిల్లా వ్యాప్తంగా వినియోగదారుల సంఘం కమిటీలను ఏర్పాటు చేసి, వాటిని బలోపేతం చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక సాయి ఆరామంలో శనివారం జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించి, జల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, వెంకటాచలపతి, ప్రధానకార్యదర్శిగా వెంకటలక్ష్మి, కోశాధికారిగా చంద్రశేఖర్ గుప్త మరికొంతమందిని సభ్యులుగా ఎంపికచేశారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కార్యవర్గం నిరంతరం పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎంపిక

తాడిమర్రి, జూలై 6: సీఐటీయూ మండలకమిటీని శనివారం ఎంపికచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు దిల్షాద్ హాజరై కమిటీ ఎంపిక నిర్వహించారు. మండల కన్వీనర్‌గా నారాయణ, కోకన్వీనర్‌లుగా భారతి, లక్ష్మీనారాయణను ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం, సత్యసాయివాటర్‌వర్క్స్‌సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ టీకా వేయించండి

బత్తలపల్లి, జూలై 6: పెంపుడు కుక్కలకు యజమానులు రేబిస్ టీకా వేయించాలని పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జోనోసిస్ డే సందర్భంగా కుక్కలకు రేబిస్ టీకా వేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ కుక్కల నుంచి మానవ వాళికి ఎటువంటి వ్యాధులు సంక్రమించకుండా ఉండెందుకు రేబిస్ టీకా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు గురునాథ్‌రెడ్డి, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు గ్లౌజుల పంపిణీ

ధర్మవరం, జూలై 6: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు టీడీపీ నా యకులు గ్లౌజులు పంపిణీచేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు భీమనేని ప్రసాద్ నాయుడు, మాధవరెడ్డి శనివారం వార్డుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అందజేశారు. వార్డుల్లో డ్రైనేజీలను శుభ్రం చేసేందుకు ఇవి ఉపయోగపడతాయని టీడీపీనాయకులు పేర్కొన్నారు

డ్రైనేజీలో పూడికతీత

ధర్మవరం, జూలై 6: పట్టణంలోని గిర్రాజుకాలనీలో డ్రైనేజీని టీడీపీ నాయకులు శుభ్రం చేయించారు. మురుగుకాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో వర్షాలు వచ్చినప్పుడు నీరంతా రోడ్లపైకి ప్రవహిస్తోంది. ఈ విషయాన్ని స్థానికులు మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి డ్రైనేజీని ఎక్స్‌కవేటర్ తో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో 32వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ కేతినేని రాజ, నాయకులు రామ్మోహన్, బాలనాగరాజు, నీలూరిచలపతి, రాజు, గంగాధర్, టైలర్ అంజి పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం

బుక్కపట్నం, జూలై 6: ప్రతి విద్యార్థి ఒక మొక్కనాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మగ్బుల్‌బాషా సూచించారు. ఏక్ పెడ్ మాకేనామ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి దానిని పరిరక్షించాలన్నారు. అపుడే పర్యావరణాన్ని కాపాడినవారవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఓబులేసు, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు శ్రీనివాసు, వెంకటేష్‌ప్రసాద్, రాజ్‌మహమ్మద్, దస్తగిరి, నాగేంద్రప్రసాద్, విద్యార్థులున్నారు.

తాగేందుకు డబ్బు ఇవ్వలేదని భార్యను చంపిన భర్త

బత్తలపల్లి, జూలై 6: మద్యానికి డబ్బు ఇవ్వనందుకు కట్టుకున్న భార్యను బండరాయితో మోది చంపేశాడు ఓ వ్యక్తి.. మండల పరిధిలోని తంబాపురంలో గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మన్న కూలి పనులు చేస్తుంటాడు. ఆయన భార్య లక్ష్మమ్మ(60) అనారోగ్యంతో మంచానికి పరిమితమైంది. ఆమెకు ఈ నెలలో పింఛన్ సొమ్ము రూ.7 వేలు వచ్చింది. ఆ డబ్బు తనకు ఇవ్వాలని లక్ష్మన్న అడిగాడు. మద్యం తాగేందుకు డబ్బులు అడగటంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన లక్ష్మన్న.. బండ రాయితో బాది చంపేసి పారిపోయాడని సీఐ ఆరోహణరావు తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

ముదిగుబ్బ, జూలై 6: మండల పరిధిలోని మలకవేముల క్రాస్ సమీపంలో శనివారం ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కదిరి రైల్వే పోలీసులు తెలిపారు. నల్లమాడ మండలం ఎర్రవంకపల్లికి చెందిన ప్రభాకర్ కుమారుడు వినోద్ కుమార్(31) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవాడు. ఎనిమిది నెలల క్రితం ఉద్యోగం వదిలేసి స్వగ్రామమైన ఎర్రవంకపల్లిలో ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతడు శనివారం ముదిగుబ్బ మండల పరిధిలోని మలకవేముల క్రాస్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందుకున్న కదిరి రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తి కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వినోద్ కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు రైల్వే పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

దర్జాగా చెరువు కబ్జా

- ఏడెకరాల్లో గడ్డి పెంపకం
- చెరువులో మూడు బోర్లు
- పొలాలకు దారివ్వని వైసీపీ నాయకుడు



వండ్లబండ చెరువులో పెంచుతున్న గడ్డి

కదిరి, జూలై 6: తలుపుల మండలంలోని కుర్లి గ్రామం వండ్లబండ చెరువును వైసీపీ నాయకుడు కుర్లి శివారెడ్డి, అతడి బంధువులు దర్జాగా కబ్జా చేసి, గడ్డి సాగుచేస్తున్నారు. గ్రామానికి చెందిన రైతులు ఆ దారి వెంట పొలాలకు వెళ్లడానికి వీలు లేకుండా పెద్ద గుంతలు తవ్వి ఇబ్బందులు పెడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మాజీ సీఎం జగనో హన్‌రెడ్డి చెప్పాడని బెదిరిస్తు న్నాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడెకరాల్లో గడ్డి పెంపకం

కుర్లి గ్రామానికి సమీపంలో ఉన్న వండ్లబండ చెరువు సర్వే నెం. 728లో 28 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులోని ఏడెకరాల్లో కుర్లి శివారెడ్డి, ఆయన బంధువులు అనుమతులు లేకుండా మూడు బోర్లు వేశారు. వాటి ఆధారంగా ఏడెకరాల్లో పశుగ్రా సం సాగుచేశారు. ఈ తంతు ఐదేళ్ల నుంచి సాగుతోంది. ఇదిలా ఉండగా చెరువులో మూడు



చెరువులో అక్రమంగా వేసిన బోరు

బోర్లు వేయడం వలన చెరువుకు చేరిన నీరంతా త్వరగా అడుగంటిపోతోందని గ్రామస్థులు అంటున్నారు. అడిగేవారు లేరని ఆ వైసీపీ నాయకుడు ఇష్టారాజ్యంగా కబ్జాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కుర్లి శివారెడ్డి దాదాపు రూ. కోటి విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణం చేపట్టగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇటీవల కూల్చేశారు.

పొలాలకు వెళ్లడానికి దారిలేదు

వండ్ల బండ చెరువు అటువైపున కుర్లిగ్రామానికి చెందిన దాదాపు మూడువందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వారంతా చెరువు దాటుకుని పొలాలకు వెళ్లాల్సి ఉంది. అయితే వైసీపీ నాయకుడు కుర్లి శివారెడ్డి అక్రమంగా ఏడెకరాల్లో గడ్డి సాగుచేస్తుండడంతో ఆవతల వైపు వెళ్లడానికి దారిలేకుండా పోయింది. అరకొరగా అవకాశమున్న చోట కూడా పెద్దగుంత తీసి అటు వెళ్లడానికి వీలు లేకుండా చేశారు. దీంతో రైతులతో పాటు పశువులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్థులు, మహిళలు వాపోతున్నారు.

చెరువు కబ్జా చేసి గడ్డి పెంచుతున్నారు



వైసీపీ నాయకుడు చెరువులో ఏడెకరాల భూమి కబ్జా చేసి గడ్డి పెంచుతున్నాడు. దీని కోసం అక్కడ మూడు బోర్లు వేయడంతో చెరువులో నీరంతా త్వరగా అడుగంటి పోతోంది. ప్రస్తుతం కనీసం పశువులు తాగడానికి కూడా నీరు లేదు. ఇదేమని ప్రశ్నిస్తే మాకు జగన్మోహన్‌రెడ్డి చెప్పారని బెదిరిస్తున్నారు.

- ప్రతాప్, కుర్లి గ్రామం

పొలాలకు వెళ్లడానికి దారి ఇవ్వలేదు



వైసీపీ నాయకుడు చెరువును కబ్జా చేసి, మా పొలాలకు వెళ్లడానికి దారివ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నాడు. పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలి.

- వెంకటరెడ్డి, కుర్లి గ్రామం



ధర్మవరంలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కదిరిలో బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ధర్మవరం, జూలై 6: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జగ్జీవన్‌రామ్ నగర్‌లోని జగ్జీవన్‌రావు విగ్రహానికి ఎమ్మార్పీఎస్‌నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు సిరిడి బూదెప్ప, రామాంజనేయులు, కేశగాళ్ల శీన, కేశగాళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్/ నల్లమాడ: బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నల్లమాడ మండలకేంద్రంలోని స్వాతి క్లినిక్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు.

బడుగుల అభివృద్ధికి కృషి చేసిన గొప్పవ్యక్తి : ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 6: అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ దేశా నికి ఎంతో సేవ చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడ వాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

హిందువులకు రాహుల్ క్షమాపణ చెప్పాలి: వీహెచ్‌పీ

ధర్మవరం, జూలై 6: పార్లమెంట్ సమావేశాల్లో హిందువులను కించపరిచేవిధంగా మాట్లాడిన రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలని విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. కాలేజ్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. అక్కడ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...హిందువుల పట్ల కాంగ్రెస్‌నాయకులు, రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. బాధ్యతగా ఉండాల్సిన ప్రతిపక్షనేత బాధ్యతారహితంగా మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు వెంగముని, రామనుజులు, హరి, దుస్సాప్రవీణ్, జింకాప్రవీణ్, శివాజీ, బీజేపీ నాయకులు సాకేఓబుళేశు, జింకాచంద్రశేఖర్, చేనేతసెల్ రాష్ట్ర సభ్యులు గుండాపుల్లయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

ముదిగుబ్బలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి : బీసీ విద్యార్థి ఫెడరేషన్

ముదిగుబ్బ, జూలై6: మండల కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలుర పాఠశాల వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పెద్ద మండలమైన ముదిగుబ్బలో దాదాపు ఆరు వందల మందికి పైగా పదో తరగతి చదువున్నారని అన్నారు. డిప్లొమా కోర్సుల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున చాలా మంది పాలిటెక్నిక్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. కావున ముదిగుబ్బలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు రాఘవేంద్ర, రవి, రాజేష్, నిషాంత్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి : సీపీఎం

ధర్మవరం, జూలై 6: టిడ్కో ఇళ్లను సంబంధిత లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు శనివారం పట్టణంలోని టిడ్కో ఇళ్ల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వం ధర్మవరం పట్టణంలో పలువురికి టిడ్కో ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అప్పట్లో వాటి నిర్మాణం 50శాతంపైగా పూర్తయిందని, అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లనిర్మాణాలను నత్తనడక సాగించిందన్నారు. తీరా ఎన్నికలు దగ్గరకు రావడంతో హడావుడి చేసి నిర్మాణాలు పూర్తి కాకనే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే కొత్త ప్రభుత్వమైనా అప్పట్లో డీడీలు చెల్లించిన అర్హులైన వారికే ఈ టిడ్కో ఇళ్లను పూర్తి చేసిన ఇవ్వాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నాయకులు శేషంపల్లి మారుతి, ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ నాయకులు ఎల్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై కొరడా



అనధికార లే అవుట్‌లో తారురోడ్డును తొలగిస్తున్న అధికారులు

కదిరి, జూలై 6: పట్టణంలోని అనధికార లే అవుట్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పట్టణంలోని పలు లే అవుట్లను అనుమతి లేనివిగా శనివారం గుర్తించారు. ఇందులో భాగంగా 35 వార్డులోని ఎన్జీవో కాలనీకి వెనుక ఉన్న అనధికార లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు, గుర్తింపు రాళ్లు, తార్ రోడ్లను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... పట్టణంలో ఇప్పటికే 72 లేఅవుట్లను అనధికారికంగా వేసినట్లు గుర్తించామని, వాటన్నిటిని తొలగిస్తామన్నారు. పట్టణ ప్రజలు ఎవరూ అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయకూడదని హెచ్చరించారు.

ప్రైవేటు డాక్టర్ మరో కబ్జా



వంక పొరంబోకు స్థలంలో నిర్మించిన షెడ్డు, పండ్ల మొక్కలు

కదిరి, జూలై 6: తలుపుల మండలకేంద్రంలోని ప్రైవేటు డాక్టర్ అయిన జయపాల్‌రెడ్డి వంక పొరంబోకు స్థలాన్ని కబ్జా చేసినట్లు రెవెన్యూ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలకేంద్రానికి సమీపంలో ఉన్న కోరుగుట్టపల్లి వద్ద ఆయనకు సంబంధించిన వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమి పక్కన ఉన్న 1.44 సెంట్ల వంక పరంబోకు స్థలాన్ని ఆక్రమించాడని తెలిపారు. ఇందులో రెండు బోర్లతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, షెడ్ నిర్మించినట్లు తెలిపారు. వంక పరంబోకులు, చెరువులు, నీటికి సంబంధించిన ఇతర భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. డాక్టర్ ఆక్రమించిన వంక పరంబోకు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు రెవెన్యూ అధికారి తెలిపారు.

సచివాలయంలో కొరవడిన సమయపాలన

- వేళకురాని ఉద్యోగులు... ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని మండల అధికారులు



చిగిచెర్లలో శనివారం ఉదయం 10.20గంటలైనా తెరుచుకోని గ్రామ సచివాలయం

ధర్మవరం రూరల్, జూలై 6: మండలంలోని పలు సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించక ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని చిగిచెర్ల, నేలకోట, ఏలుకుంట్ల, దర్శినమల, రేగాటిపల్లి తదితర గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. రోజూ ఉదయం 10.30గంటలకు హాజరవుతున్నారని, అది కూడా ఒకరిఇద్దరు మాత్రమే అంటున్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాల వద్దకు వెళ్లి, ఉద్యోగుల కోసం పడిగాపులు కాస్తున్నామని వాపోతున్నారు. సచివాలయాలపై మండల స్థాయి అధికారుల పర్యవే క్షణ కొరవడడంతో ఉద్యోగులు ఇష్టాను సారంగా విధులకు వస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ఇదేవిషయం పై ఎంపీడీఓ మమతాదేవిని వివరణ కోరగా... సచివాలయ ఉద్యోగులు తప్పక సమయపాలన పాటించాలని అన్నారు. ప్రతి ఉద్యోగి ఉదయం 10గంటలకు సచివాల యానికి చేరుకోవాలన్నారు. ప్రస్తుతం తాను మెడికల్ లీవ్‌లో ఉన్నానని, తప్పక వీటిపై ఉద్యోగులకు ఆదేశాలు ఇస్తామన్నారు.

అగ్రిగోల్డు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే కందికుంటకు వినతిపత్రం ఇస్తున్న అగ్రిగోల్డు బాధితులు

కదిరిఅర్బన్, జూలై 6: అగ్రిగోల్డు బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం అగ్రిగోల్డు కస్టమర్సు ఎజెన్సీ హెల్ఫర్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో శనివారం ఎమ్మెల్యేతో వారు మాట్లాడుతూ అగ్రిగోల్డు సంస్థలో కస్టమర్లు, ఏజెంట్లు డిపాట్లు చేశారని, ఉన్నఫలంగా బోర్డు తిప్పేయడంతో బాధితులు రోడ్డున పడ్డారన్నారు. గత ప్రభుత్వం అగ్రిగోల్డు బాధితులకు న్యాయం చేస్తామని ఐదేళ్లుగడిపేసిందన్నారు. నూతన ప్రభుత్వంలో అయినా న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అత్తార్ మహబూబ్‌బాషా, ఉత్తన్న, మహమ్మద్‌రఫీ, ఆనంద్‌బాబు, ఇందాయత్, సత్యనారాయణ, శ్రీరాములు తదితరులున్నారు.

117 జీఓను రద్దుచేయాలి: ఎస్టీయూ

కొత్తచెరువు, జూలై 6: టీడీపీ కూటమి ప్రభుత్వం 117 జీఓను రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు జీవం పోయాలని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం మండలంలోని కొడపగానిపల్లి జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సంబంధిత కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ... సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధ రించాలన్నారు. అలాగే డీఎస్సీ నోటిఫికేషన్‌లో పాత పెన్షన్ విదానంతో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సదుపాయాన్ని కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పలువురు ఉపాధ్యాయుల పదవీ విరమణ వల్ల, ఉద్యోగోన్నతుల వల్ల చాలా ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌ల పోస్టులు ఖాళీగా ఉన్నాయ న్నారు. వాటిని తాత్కాలిక ప్రాదిపతికన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గొర్ల రవిచంద్ర, నాయకులు వెంగమనాయుడు, కిష్టప్ప పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలి: ఏపీటీఎఫ్

ధర్మవరం, జూలై 6: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 117 జీఓను వెంటనే రద్దుచేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విలీనం చేపట్టి ప్రాథమిక విద్యా వ్యవస్థను చిన్నాబిన్నం చేసిన జీఓ 117ను రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. అదేవిదంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పరిష్కరించాలని, మున్సిపల్ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, అప్గ్రేడ్ అయిన ఉన్నతపాఠశాలలకు ఉపాధ్యాయ పోస్టులను కేటాయించాలనే పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రదానకార్యదర్శులు శ్రీనివాసులు, జగదీశ్, నాగభూషణ, వెంకటేశ్, అమానుల్లా, చెన్నుడు, అంజినాయక్, చంద్రశేఖర్, మోహన్ పాల్గొన్నారు.

నీట్‌పై సమగ్ర విచారణ జరిపించాలి : పీడీఎస్‌యూ



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూనాయకులు

ధర్మవరం, జూలై 6: నీట్‌పై సమగ్ర విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూజిల్లా కార్యదర్శి నిరంజనయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ బైఠాయించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌యాదవ్ మాట్లాడుతూ..నీట్ పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించిన ఎన్టీఏను రద్దుచేయాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలమూసివేతను ఆపాలని, విద్యార్థి సంఘాలనాయకులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. వీటిపై రాష్ట్ర మంత్రులు అసెంబ్లీలో చర్చించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్‌రెడ్డి, జిల్లా సభ్యులు తెల్లార్, నవీన్‌పాల్గొన్నారు.

అన్నదాత ఆదాయానికి కత్తెర..!

● కత్తెర పురుగుతో మొక్కజొన్నకు ముప్పే ● సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయ అధికారులు

చిలమత్తూరు, జూలై 6: వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా సాగుచేస్తున్న మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ముప్పు తప్పేటట్లు కనపడలేదు. పంట కీలక దశలో పురుగు పంటపై దాడి చేసి నష్టాలకు గురయ్యేలా చేస్తోంది. మొక్కజొన్న సాగు చేసుకుంటున్న రైతులకు కత్తెర పురుగు కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. కత్తెర పురుగుని నివారిస్తే ఇక మొక్కజొన్న పంట జేబుల్లో ఉన్నట్లే. అయితే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే నష్టం తప్పదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మండలంలో ఇప్పటికే బోరుబావుల ఆధారంగా పంట విత్తుకొనగా, ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు అధిక సంఖ్యలో రైతులు మొక్కజొన్న విత్తుకుంటున్నారు. అయితే రైతుకి మొక్కజొన్న లాభదాయకంగా ఉన్నా కత్తెర పురుగు ఆందోళన కలిగిస్తోంది. విత్తనాలు మొలక దశ నుంచి ఈ కత్తెర పురుగు పంటపై పడుతోంది. మొక్క నాలుగు ఆకులు చిగురించగానే కాండం లోపలి భాగాన పురుగు చేరుకొని సుడి ఆకులను గీక్కుని తింటుంది. దీంతో మొక్క సుడి తెగిపడి ఆకులన్నీ నాశనం అవుతాయి. ఇదంతా కేవలం మొక్కకు పురుగు పట్టిన రెండు మూడు రోజుల్లోనే జరగడంతో రైతుల్లో ఆందోళన మొదలయ్యింది. ఈ సమయంలో రైతులు పురుగు నివారణకు పిచకారి చేయకపోతే పంటను పూర్తిగా కోల్పోవలసి వస్తుంది. శ్రమటోర్చి, పెట్టుబడులు భరించి సాగు చేస్తున్న పంటలకు చీడపీడల బెడద తప్పడం లేదు. కలుపు తీత దశలో ఉన్న పంటకు అక్కడక్కడ కత్తెర పురుగు సోకింది. దాంతో పచ్చని పైర్లు తెల్లబారి వాడిపోతున్నాయి. రోజు రోజుకూ పంటలో పురుగు ఉధృతి అధికమవడంతో పైర్లు ఒక్కొక్కటిగా నేలరాలుతున్నాయి. దీంతో పొలంలో పంట పైర్లు పలుచనైపోతున్నాయి. మొక్కజొన్న పంటకు అధిక నష్టం కలిగిస్తున్న ఈ కత్తెర పురుగు నివారణకు 2,3 ఆకుల దశలో వేప మందు 1500 పీపీఎంని పిచికారి చేసుకోవాలి, దీంతో గుడ్ల దశలో ఉన్న కత్తెర పురుగును నివారించవచ్చు. పొలంలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవాలి, ఎమామీథేన్ బెంజోనెట్ మందును పైర్ల సుడుల్లో పడేవిధంగా పిచకారి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ రైతులకు సూచిస్తున్నారు. సకాలంలో పిచికారి చేసుకోకపోతే పంటను తీవ్రంగా నష్టపోతారని హెచ్చరిస్తున్నారు.


కత్తెర పురుగు సోకిన మొక్కజొన్న పైరు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు మంత్రి నివాళి


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 6: స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా చేనేత జౌళిశాఖ మంత్రి సవిత నివాళి అర్పించారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి నివాళి అర్పించిన ఆమె మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, బీహార్‌లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చారన్నారు. 40ఏళ్లపాటు వివిధ మంత్రి పదవులు నెరవేర్చడమేకాక ఉప ప్రధానిగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో మాదవనాయుడు, సర్పంచ్ శ్రీనివాసులు, కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు సూరీ, రామలింగ, రఘువీరచౌదరి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, రొద్దం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని స్థానిక బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్యవేదిక నాయకులు వెంకటేశులు, రవికుమార్, పెద్దన్న పాల్గొన్నారు.

హిందూపురం(సోమందేపల్లి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా దండోరా నాయకులు, దళిత సంఘం నాయకులు నివాళి అర్పించారు. టీడీపీ మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, నాయకులు సూర్యనారాయణ, నరసింహమూర్తి, నాగరాజు, గంగారాం, రామాంజనేయులు, శిరీష పాల్గొన్నారు.

మడకశిర(అమరాపురం) : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని అమరాపురం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గణేష్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, మండల అధ్యక్షుడు చన్నప్ప, గురు సిద్దప్ప, మంజునాథ్, గుణేహళ్లి దయానంద, అగ్రహారం సిద్దేశ్వర, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు రఘుయాదవ్, ఎల్‌ఐసీ నాగరాజు, తెలుగు యువత నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నాగరాజు, దళిత నాయకులు ఓంకార్, లింగరాజ్, సతీష్ కుమార్, మంజునాథ్, విశ్వ, కృష్ణమూర్తి, నీలకంఠ, రాజా ఉన్నారు.


నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జూలై 6: పట్టణంలో వైసీపీ నాయకులు తెలుగుదేశం బాట పట్టారు. శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన రమేష్, టైలర్ గోపాల్ తదితరులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. వీరికి గుండుమల తిప్పేస్వామి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, కౌన్సిలర్ నరసింహరాజు, నాయకులు బలరాం, రమేష్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హిందూపురం అర్బన్, జూలై 6: డయేరియా లాంటి సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయుష్ వైద్యురాలు వై. అనురాధా సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని వెంకటేశ్వరా వృద్ధాశ్రమంలో వృద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె వృద్ధులకు పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : గుండుమల

మడకశిర రూరల్, జూలై 6 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదుగాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం గుండుమలలోని మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాలలో జరిగిన విద్యార్థుల సమావేశానికి ముఖ్య అతిథులుగా గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాల తనిఖీ

హిందూపురం(పరిగి), జూలై 6 : మండల పరిధిలోని కొడిగెనహళ్లి అంధుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఫిర్యాదు మేరకు సబ్ కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థుల తో ముఖాముఖి నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. పాఠ శాలలో భోజనం, వసతి గృహాన్ని పరిశీలించారు. రాత్రివేళల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల లైంగిక వేధింపులపై ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. పూర్తిస్థాయి విచారణచేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పరిగి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల వినతి

పావగడ, జూలై 6 : జలజీవన మిషన్(జేజేఎం) పథకం కింద పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. బిల్లుల సమస్య ఎదుర్కొంటున్న సబ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాగునీటి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బెంగళూరు నీటిపారుదలశాఖ కార్యాలయం నుంచి వర్క్‌స్లిప్‌ల రాకపోవడమే సమస్యకు కారణమన్నారు. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు : ఏఓ

హిందూపురం(సోమందేపల్లి), జూలై 6 : భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కవితారెడ్డి రైతులకు సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తమ వ్యవసాయ పొలాల నాణ్యత తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. దీంతో అనవసరంగా వాడే రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకుని, అధిక లాభాలు సొంతం చేసుకోవచ్చన్నారు. మండల వ్యాప్తంగా 13రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉప కేంద్రం కింద 42పరీక్షలు చొప్పున 538 భూసార పరీక్షలు 238 మట్టి నమూనాల సేకరణ చేయాల్సి ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆకట్టుకుంటున్న జగన్నాథ చిత్రం

హిందూపురం అర్బన్, జూలై 6: ఆ చేయి కదిలిందంటే ఎంతటి చిత్రమైనా రూపు దిద్దుకోవాల్సిందే. ఎన్నో చిత్రాలు గీసి భళారే అనిపించుకున్నారు. పట్టణ పరిధిలోని ఓం క్రియేషన్ సరస్వతీ వెంకటేష్ ఓం క్రియేషన్ స్కూల్‌ను స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు చిత్రకళలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. పూరీ జగన్నాథుడి రథ యాత్ర సందర్భంగా పాండురంగ నగర్‌లోని ఆమె గీసిన చిత్రానికి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.


పూరీ జగన్నాథుడి చిత్రంతో సరస్వతీ వెంకటేష్

మీ పాలనలో అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

● వైసీపీ నేతలకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సవాల్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూలై 6: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ వసూళ్లు, అవినీతిపై బహిరంగ చర్చకు మేము సిద్ధం మీరు సిద్ధమా వైసీపీ నేత ఈరలక్కప్పకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సవాల్ విసిరారు. శనివారం మడకశిర ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడిన ఆయన వైసీపీ ఐదేళ్ల కాలంలో అక్రమ వసూళ్లకు లెక్కలేదన్నారు. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కూడా మార్చలేకపోయారని, మీరు మా గురించి మాట్లాడుతారా అంటూ మండిపడ్డారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ముందు సీటులో కూర్చొంటే తప్పేమీ లేదన్నారు. అప్పటి ఎమ్మెల్యే దళితులతో సైతం డబ్బులు వసూలు చేశారన్నారు. టీడీఎల్‌పీ మీటింగ్‌లో సీఎం చంద్రబాబునాయుడు కక్ష సాధింపు రాజకీయాలు వద్దని సూచించారని అదే నియమాన్ని పాటిస్తానన్నారు. అనంతరం పట్టణంలో పర్యటించిన ఆయన అంబేడ్కర్ సర్కిల్ ఏర్పడిన పెద్ద రంధ్రం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, దానికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు తదితరులు ఉన్నారు.

సత్వరమే అందిన సాయం

● దరఖాస్తు చేసిన రెండు రోజులకే సీఎం సహాయనిధి


సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు

హిందూపురం, జూలై 6 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చేయి ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితులకు రెండు రోజులకే చెక్కు అందజేయడంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిలమత్తూరు మండలం చేనేపల్లికి చెందిన ఆదినారాయణప్ప కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనకు ఓ చేయి విరిగింది. హైదరాబాద్‌లో ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించారు. పేదవాడైన ఆదినారాయణప్ప ఆర్థిక స్తోమతలేదని చిలమత్తూరు మండల టీడీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా బుధవారం అందుకు సంబంధించిన దరఖాస్తును ముఖ్యమంత్రి సహాయనిధికి పంపారు. పంపిన రెండ్రోజులకే రూ.1.5లక్షల చెక్కును ఎమ్మెల్యే కార్యాలయానికి పంపారు. దీనిని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు బాధితుడికి చెక్కును అందజేశారు. బాధితుడు ఆదినారాయణ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న రెండురోజులకే సీఎం సహాయనిధి అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రంగారెడ్డి శ్రీదేవి, నాగమ్మ, లక్ష్మీ, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు


పైపులు వేస్తున్న నగర సిబ్బంది

పెనుకొండ రూరల్, జూలై 6: గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీటిని అందించే ప్రధాన పైప్‌లైన్‌కు శనివారం పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. పైప్‌లైన్ పగిలి నీరంతా వృధా అని ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మరమ్మతులు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి


మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, జూలై 6: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు సీఐటీయూ, అంగన్‌వాడీ నాయకులు వినతిపత్రం అందజేశారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, బాబావలి, అంగన్‌వాడీ నాయకులు బావమ్మ, మాబున్నిసా, సావిత్రమ్మ, లక్ష్మీదేవి, తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు రావాల్సిన బకాయిలు వెంటనే ఇప్పించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన ఖర్చుల కింద రూ.20వేలు ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రధానమంత్రి జీవిత బీమ అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. 165సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయాలని, జీఓ 47 మార్చు చేయాలని, న్యూమోడల్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొదటి వర్కర్‌కు రూ.50వేల నుంచి లక్షకు పెంచాలన్నారు. సమ్మె కాలంలో చనిపోయిన అంగన్‌వాడీ వర్కర్లకు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు ఖర్చుల కింద రూ.20వేలు అవ్వాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

మడకశిర, జూలై 6: ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా శనివారం తనిఖీ చేశారు. ఏలూరు జిల్లా పుంగనూరు సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు శివకుమార్, విజిలెన్స్ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ మడకశిర పట్టణంలోని లక్ష్మీఆదినారాయణ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలోని నిల్వలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌లోని ఎరువులకు, ఎరువుల నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో 15.45 టన్నులు, పది రకాల ఎరువులను వాటి విలువ రూ.14.59లక్షల ఎరువులను సీజ్ చేశారు. అదేవిధంగా 47 లిట్ రూ.1.01లక్షల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. ప్రభుత్వం నిర్ణయించిన దర కంటే అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని డీలర్లకు హెచ్చరించారు. రశీదు లేకుండా అమ్మితే చర్యలు తప్పవన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణమీనన్, మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప పాల్గొన్నారు.

మడకశిరలో 22 మి.మీ. వర్షం


బాలికల హాస్టల్ వద్ద నిలిచిన వర్షపునీరు

మడకశిర టౌన్, జూలై 6: పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఓమోస్తరు వర్షం కురిసింది. 22 మి.మీ. నమోదయినట్లు అధికారులు తెలిపారు. దీంతో వంకలు, వాగులు నీటితో కళ కళ లాడుతున్నాయి. ఇటీవల మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా కురుస్తుండటంతో చిన్న చిన్న చెక్‌డ్యాంలు, నీటి కుంటలకు నీరు చేరి జల కళ సంతరించుకుంటోంది. కొన్ని కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బైపాస్‌కు వెళ్లే రహదారిలో బీసీ బాలికల హాస్టల్‌కు వెళ్లే రోడ్డంతా నీటి మయంగా మారింది.

క్రైస్తవ సేవా రత్న ప్రదానం

హిందూపురం అర్బన్, జూలై 6: డాక్టర్ ఏ నాగేంద్రకుమార్‌కు ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ క్రైస్తవ సేవా రత్న అవార్డును ప్రదానం చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని అమృతవాణి కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు సేవా రత్న అవార్డును అందించారు. హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాల ఎంబీఏ ప్రిన్సిపాల్‌గా, సీఅండ్ ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చి కార్యదర్శిగా అటు విద్యాభివృద్ధికి, క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కు అవార్డు దక్కిందన్నారు.

రోటరీక్లబ్ సేవలు విస్తరింపజేస్తా..

హిందూపురం అర్బన్, జూలై 6: రోటరీ క్లబ్ సేవలు విస్తరింపచేస్తామని సీనియర్ న్యాయవాది నాగరాజరెడ్డి పేర్కొన్నారు. శనివారం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఎంపికైన ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా ఎన్నో ప్రజాసేవా కార్యక్రమాలు చేస్తున్నారని వాటిని మరింత విస్తరించేలా అందరితో కలిసి కృషి చేస్తానన్నారు. కార్యదర్శిగా ఎం. శ్రీనివాసులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రాయలసీమజోన్ ఏజే సాధు గోపాలకృష్ణ, సభ్యులు రాయల్‌గోపాల్, రామచంద్రారెడ్డి, వరదరాజులు, అశ్వర్థరెడ్డి, ఆదినారాయణ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి

అనంత జిల్లా ఎన్నికల అబ్జర్వర్ విలాస్‌షిండే


ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, జూలై 6 : చారిత్రాత్మక కట్టడాలను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అనంతపురం జిల్లా సాధారణ ఎన్నికల అబ్జర్వర్ విలాస్ షిండే పేర్కొన్నారు. పెనుకొండలోని గగన్‌మహల్, తిమ్మరుసు బందీఖానా, కొండపైన పురాతన ఆలయం, పెనుకొండ కోట, చారిత్రక కట్టడాలను తిలకించారు. ఆయన వెంట అనంతపురం పురావస్తుశాఖ జిల్లా అధికారి రజిత ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక కట్టడాలను కాపాడడానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులుపాల్గొన్నారు.

మాధవరాయ ఆలయం సందర్శన..

గోరంట్ల పట్టణంలో పురాతనమైన మాధవరాయ ఆలయాన్ని సత్యసాయి జిల్లా ఎన్నికల అబ్జర్వర్ రిథమ్‌భాగ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. మూల విగ్రహం భిన్నం కావడం వల్ల ఆలయంలో పూజలు నిర్వహించడంలేదని స్థానికులు తనవంతు సహకారం అందిస్తానన్నారు. గోరంట్ల తహసీల్దార్ అక్బల్‌బాషా, పుట్టపర్తి లైజన్ అధికారి డిటీ నాగార్జునరెడ్డి, గ్రామాభ్యుధ మహిళ మండలి అధ్యక్షురాలు రమాపావనిరాయల్, ప్రధాన పురోహితులు భాస్కర్‌తారానంద్‌శర్మ, టీడీపీ నాయకులు మాజీ కన్వీనర్ సుబ్రమణ్యం, చిన్నబాబు, పులేరు హరి, జనసేన అనిల్, రామప్ప, సూరి తదితరులున్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్


జస్టిస్ మన్మథరావును సత్కరిస్తున్న పురం బార్ అసోసియేష్ నాయకులు

హిందూపురం, జూలై 6 : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మదరావును శనివారం అనంతపురంలో హిందూపురం బార్ అసోసియేషన్ నాయకులు కలిశారు. న్యాయవాదుల సమస్యలపై వారు వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సిద్దు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఆర్‌ఓప్లాంట్ వితరణ

రొళ్ల, జూలై 6: మండల సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్ వితరణ చేశారు. రిటైర్డ్ ఆర్‌బీఐ తమిళనాడు రీజనల్ డైరెక్టర్ సూచన మేరకు రూ.1.40లక్షల ఆర్‌ఓప్లాంట్, 15 వాటర్‌క్యాన్‌లను ముత్తూట్‌ఫైనాన్స్ వారి సహకారంతో అందజేసినట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. ఈకార్యక్రమంలో పెనుకొండ అడ్వకేట్ ప్రతాప్‌రెడ్డి, ఎంఈఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


వాటర్ క్యాన్లను అందజేస్తున్న దాతలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, జూలై 6 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కియా పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుట్టూరు సమీపంలో మునిమడుగుకు వెళ్లే రహదారిలో రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం బోల్తాపడిన సంఘటనలో గాయపడిన అనిల్ కుమార్(40) చికిత్స పొందుతూ మృతి చెందారు. మునిమడుగు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ రెండు రోజుల క్రితం గుట్టూరుకు నుంచి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు హుటాహుటిన అతన్ని గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అనంతపురం, బెంగళూరుకు తరలించారు. శుక్రవారం రాత్రి బెంగళూరులో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 6 : మండల పరిధిలోని జాతీయ రహదారిపై శనివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఓ కుటుంబం ప్రయాణిస్తుంది. వెలగమాకులపల్లి, ఆర్ఆర్ డాబా సమీపంలో ముందుగా వెళ్తున్న ఐచర్‌వాహనాన్ని ఓవర్‌టెక్ చేయబోయి వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో వికాస్, తల్లిదండ్రులు స్వల్పంగా గాయపడగా కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బెంగళూరుకు తరలించారు. గాయాలతో బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

అగళి, జూలై 6: మండలంలోని ఇనగలూరు గ్రామంలో ఎస్‌ఐ వీరేష్ శుక్రవారం పోక్సో కేసును నమోదు చేశారు. విషయం తెలుసుకున్న పెనుకొండ డీఎస్పీ బాబిజాన్‌సైద శనివారం ఇనగలూరు గ్రామానికి వెళ్లి కేసుపై గ్రామస్థులతో విచారణ చేపట్టారు. అనంతరం అగళి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పాత కేసులు రికార్డుల పరిశీలన అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తదితర వాటిపై ఎస్‌ఐ వీరేష్‌తో అడిగి తెలుసుకున్నారు. రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ, సిబ్బంది ఉన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

మడకశిర రూరల్/రొళ్ల, జూలై 6: పట్టణ సమీపంలో చీపులేటి గ్రామం వద్ద ఉన్న గార్మెంట్ పరిశ్రమలో ఉద్యోగాలకు ఆదివారం నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలుగు యువత అధ్యక్షుడు మారుతిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మడకశిర పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి వారి సమక్షంలో జాబ్‌మేళాను నిర్వహిస్తారన్నారు.

జూట్ సెంటర్‌కు స్థలం కేటాయింపుపై హర్షం

గోరంట్ల, జూలై 6: మండలంలోని గౌనివారిపల్లి విశాల ఫెర్రర్ మహిళ సంఘం నిర్వహిస్తున్న జూట్ బ్యాగుల తయారీ కేంద్రానికి ఐదుసెంట్ల ప్రభుత్వ స్థలం కేటాయించడంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. గౌనివారిపల్లికి చెందిన 15మంది మహిళలు ఆర్డీటీ సహకారంతో జ్యూట్ జ్యూట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గ్రామంలోని సర్వేనెంబర్ 686లోని ప్రభుత్వ స్థలంలో జూట్ సెంటర్ కోసం 5సెంట్లు కేటాయించాలని మంత్రి సవితను ఇటీవల వారు కోరారు. మంత్రి ఆదేశంతో గోరంట్ల తహసీల్దార్ అక్బల్ బాషా ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి స్థలం కేటాయించాలని మండల సర్వేయర్ తాతయ్యను శనివారం ఆదేశించారు. మంత్రి సవిత, తహసీల్దార్ అక్బల్ బాషాకు టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిహారం చెల్లించాలని రైతుల వినతి

గౌనివారిపల్లికి చెందిన 20మంది ఎస్సీ రైతులు సాగుచేస్తున్న పొలాల్లో కొంత భాగం ముద్దనూరు టూ హిందూపురం హైవే రోడ్డు విస్తరణకు కేటాయించారు. ఇందుకు సంబంధించిన పరిహారం సాగు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ తిరుపాల్, మాజీ ఎంపీటీసీ నాగభూషణ ఆధ్వర్యంలో రైతులు కదిరిప్ప, లక్ష్మీనారాయణ, శంకరప్ప, లక్ష్మీనరసప్ప, పెద్దప్పయ్య, గంగులప్ప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

పావగడ, జూలై 6: పట్టణంలోని జ్ఞాన బోధిని పాఠశాలలో ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నామినేషన్లు వేయడం, ఉపసంహరించుకోవడం, తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అనీల్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు సంధ్య, రమ్య, రాంబాబు, సయ్యద్ షకుర్, ఖాన్ తదితరులు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.